స్కెచ్

# సత్యమేవ జయతే - ?

యస్. సూరి

నేను మొన్ననే కళాశాల రాక్షసిని శాశ్వతంగా వదలించుకొని రైలులో పడ్డాను. నాకు గట్టి నమ్మకం, లిటరేచరులో యూనివర్సిటీ ఫస్టుగా వస్తానని. అందువల్ల నా ఉత్సాహం చాలా వుద్ధృతంగా వుంది.

సంఘసృష్టిలో నేను నిరుపేదని. నాదుస్తులు కూడా అంతకంటె లోతుకు చూడలేని వారికి అదే అభిప్రాయాన్ని ధృవపరుస్తాయి.

నేను బెజవాడ వచ్చి సినిమా (హామ్లెట్) చూసి యింటికి పోవాలి. ఇపుడు చూడకపోతే యీ మహాదృష్టం మళ్ళీ ఎప్పుడు కల్గుతుంది? అవకాశాలను వదలుకొనే మందబుద్ధి కాదు నాది మరి—

సత్యనారాయణపురం స్టేషన్‌లో దిగాను రైలు. పరధ్యానంగా జేబులోకి టిక్కెట్టు కోసం చెయ్యి పోనిచ్చాను. చెయ్యి జేబులో టిక్కెట్టు వెతుకుతూంటే, కన్ను సెకండు క్లాసు పెట్టె ముందు జనాన్ని తోసుకొని ఎక్కుతున్న ఒక పెద్దమనిషి జేబులో పర్సును కొట్టేస్తున్న దొంగ మీద పడింది. గభాలున వెళ్ళి చటుక్కున పర్సుతోబాటు చెయ్యిని పుచ్చుకొన్నాను. పట్టుకోవటము, టప్ టప్ మని నాలుగు బాదటం ... ఒకేసారి జరిగాయి. కొందరు ప్రయాణీకులు కూడా శ్రద్ధ దీసుకొని చొరవ జూపారు. కొట్టటంలో దాక్షిణ్యం జూపలేదు ఎవరూ. చివరికి వాడిని స్టేషన్‌లో అప్పజెప్పి, నాకు కృతజ్ఞత చెప్పి సెలవు తీసుకొని వెళ్ళాడు డబ్బు పోగొట్టుకోబోయిన పెద్ద మనిషి.

నాకు చాలా ఆనందం వేసింది. వీళ్ళకు బుద్ధి నేర్పాల్సిందే. నేనే లేకపోతే ఆ పెద్ద మనిషి, డబ్బుపోవడం అటుంచి, పాపం కొత్తచోట ఎంత యిబ్బంది పడేవాడు! వెంటనే నాకు నా రూపాయి పావలా వున్న పర్సు నిడదవోలు స్టేషన్‌లో పోయినపుడు నేను బెజవాడ రావడానికి పడ్డ అవస్థ జ్ఞప్తికి వచ్చింది. మరి కానీ కూడా మిగల లేదాయె.

మర్నాడు సాయంత్రం సినిమాహాలు దగ్గర టిక్కెట్టుకోసం తోసుకొనే జనాన్ని చూస్తూ కౌంటర్ దగ్గరకు చేరటానికి ఆలోచిస్తున్నాను. నేను హామ్లెట్ మీదగల ఇష్టం కొద్దీ జనాన్ని తోసుకొనైనా వెళ్ళి టిక్కెట్టు సంపాదించటానికే నిశ్చయించాను. చొరబడ్డాను. ఇంతలో టప్ టప్ మని నామీద వరసగా ఒక డజనుకు పైగా చేతులు పని చేస్తున్నాయ్. నేను చటుక్కున యివతల కొచ్చేశాను. నా చుట్టూ పద్మవ్యూహంలాగా పదిమంది వున్నారు. వాళ్ళ చేతులు ఆడుతూనే వున్నాయి నా ఒంటి మీద. నేను ఆత్మరక్షణార్థం అటు యిటు పరుగెత్తక తప్పింది కాదు. ఎటుపోయినా దెబ్బలు మాత్రం తప్పటంలేదు. భరించలేక పోయాను. గభాలున పరుగుపుచ్చుకొన్నాను. నన్ను వెంబడించి పాతికగజాలు దాటకముందే "పట్టుకో, ఎక్కడికి పోతావు దొంగవెధవా..." అంటూ మొహంమీద బాదటం మొదలెట్టాడు - హాఫ్ సూట్‌లో వున్న ఒక యువకుడు. అరే, వీడు నిన్న నేను పట్టుకొన్న జేబు దొంగవాడే!

"ఏమిటి, ఏమిటి?" అంటూ నలుగురూ పోగయ్యారు.

"దొంగవెధవ పర్సు కొట్టేసి పారిపోతున్నాడు" అన్నాడు హాఫ్‌సూట్ యువకుడు.

నేను నిజం చెప్పబోయాను నామాట వినే దెవరు?

"ఎంత వున్నది పర్సులో?" అన్నా రెవరో.

"పాతికరూపాయిలు," అని నాపక్క జేబు లోంచి పర్సు తీశాడు.

అరె! ఆపర్సు నాది కాదే! నా పర్సులో వున్నది రెండున్నరకంటే ఎక్కువ లేదే! పర్సులో నించి పాతికరూపాయిలు తీశాడు.

నాకు అంతా అర్థమైంది. అందులో పెద్ద మనిషిగా కన్పించిన ఆయన్ని చూసి "నేను తీయలేదండీ!" అని అన్నాను దీనంగా.

"తీయకపోతే అది నీ జేబులోకి ఎట్లా వచ్చింది?" అని లాయరు పాయింటు లాగాడు.

"ఏమో! వీళ్లే నా జేబులో పర్సును పెట్టి నామీద బనాయించారు—" నేను చెప్పేది పూర్తి కాకముందే "దొంగ బొంకుడు," "దొంగ వేషాలు," "గజ టక్కరి" అని నాలుగు మూలలనుంచీ గాలి లోనికి ప్రసారిత మయాయి.

"నీమీద దొంగతనం అంటగట్టటానికి నీతో యేమైనా విరోధమా యీయనకి?" అన్నాడు పెద్ద మనిషి.

లోకంలో చాలామంది యిలాగే తమ పరిమితమైన ఆలోచనలతో ప్రతి విషయాన్నీ నిర్ణయిస్తారు. పోనీ తమది తప్పు అభిప్రాయమేమో అనేది వారి బుద్ధికి తట్టదు.

నేను "నిన్న" అనబోగానే, "యింకా చూస్తారేం, నలగబొడిచి స్టేషన్లో అప్పచెప్పక" అంటూ నాల్గు మూలలనుంచీ ప్రేక్షక జనం అరిచింది. వాళ్లు అలడమూ, కొట్టడమూ ఒకేసారి జరిగాయి. అబ్బ: ఆదెబ్బలు భరించలేక పోయాను. ఏడ్చాను. బతిమాలాను. కాళ్లు పట్టుకొన్నాను. కాస్త విశ్రాంతి తీసుకొంటున్నారులా వుంది, వీపుపై చేతులు పల్చబడినై.

ఒకాయన "ఇంకేంకొడతారు స్టేషన్లో అప్పచెప్పండి" అని సలహా యిచ్చాడు చూడలేక.

వీలు దొరికిందికదా అని "నిన్న సాయంత్రం యీయన జేబు కొట్టుండగా పట్టుకొని కొట్టానని యీ పన్నాగం పన్ని నన్ను కొట్టున్నారు." అన్నాను జాలిచూపిన పెద్ద మనిషితో.

ఇంకేముంది- మళ్లీ ఒక డజను చేతులు ఆడాయి ఒక అయిదు నిమిషాలు. ఒక మొద్దు చెయ్యి వచ్చి నా దవడమీద గట్టిగా తగిలింది. ఆ దెబ్బతో ముక్కువెంట, నోటివెంట నెత్తురు జోరుగా కారటం మొదలెట్టింది. చూసి ఒక హృదయం గల పెద్దమనిషి "ఇంకేం కొడ్తారయ్యా, మనిషి చస్తాడేమో. ఏం కొట్టారో ఏమో. ఇకనైనా స్టేషనులో అప్పచెప్పండి" అన్నాడు.

"దొంగతనం చేయటమేగాక ఆ పెద్దమనిషి మీదే తిరిగి దొంగతనం బనాయిస్తున్నావా?" అని అన్నాడు హాఫ్‌సూటు దొంగను చూసి.

"చూడండి, యీ రాస్కెల్లు ఎంతటక్కరో" అన్నాడు నిన్నటి దొంగ.

"దొంగ వెధవ బలేటక్కరి- చూస్తారేం, నాలుగు వుతకండి" అని అన్నాడు వుత్సాహంతో అప్పుడే వచ్చి ఆనందిస్తున్న ఒక పల్లెటూరి ప్రేక్షక మహాశయుడు.

"ఇది చాలక సినిమా గూడా ఎక్కడ చెడగొట్టుకోనేది? పోనీండి...యిక వెధవని." అని తనదారిని చక్కాబోయాడు నిన్నటి దొంగ.

అసలు గల్లంతు దొంగతనమాయె. మాసేటప్పుడు ఆనందంతో ఒళ్లు మరచి చూచిన ప్రేక్షక జనం తిరిగి వెళ్లేటప్పుడు తమతమ జేబుల భద్రతను చూసుకొన్నారు. పాపం, ఏముంది! ముగ్గురు పల్లెటూరి అమాయకుల జేబులు ఖాళీ! తరచు యిలా యిటువంటి సమయాల్లో మోసపోయేది వాళ్లేగా! వెంటనే తమ తమ డబ్బు పోయిందని గల్లంతు చేశారు. మళ్లీ జనంలో కలవరం బయలుదేరింది. నేను యిప్పుడైనా నిజమైన దొంగ బయట పడతాడనే ఆనందంతో కారేరక్తాన్ని తుడుచుకొంటూ బయటపడి దొంగకోసం ఎదురుచూస్తున్నాను.

"ఇంకెవరుంటారు? ఇందాకటి జేబు దొంగదే యీపనీని" అంటూన్నారు.

నాగుండె ఆగిపోయింది. ఆలోచన లేదు. సిలువుగుద్దు వేశాను.

"పారిపోయాడేమో పట్టుకోండి" అని అరుపులు. ఆమాటలు వింటుంటే నాఒళ్లు గగుర్పొడిచింది. నామార్గం ఏమిటో నాకు తెలిసింది. నేను పారిపోవాలి. దొంగతనాన్ని నెత్తిన వేసుకొని అయితేమాత్ర మేమిటి?

"పారిపోతాడేమో" అని నాకు మహోపకారం చేసిన మార్గదర్శకుడైన ఆ అజ్ఞాత శ్రేయోభిలాషి ఋణం ఎప్పుడు, ఎలా తీర్చుకోగలను,

వెంటనే దొంగతనాన్ని — ఒకటి కాదు నాలుగు నెత్తిన వేసుకొని గబుక్కున ప్రక్కసందులోకి పరుగెత్తాను. మొదట్లో స్పష్టంగానూ, పిమ్మట అస్పష్టంగానూ 'దొంగను పట్టుకోండి' అని కేకలు వినిపించాయి కొంతదూరంవరకూ.